

రుణ సాయానికి దూరం

- వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ పథకానికి నోచుకోని రైతులు
- అవగాహన లేకపోవడమే కారణం
- గోదాముల్లో పంటను నిల్వ చేసుకుంటే 'రైతుబంధు'
- రీజియన్ పరిధిలో రూ.28కోట్లు కేటాయింపు..
- రుణం తీసుకుంది మాత్రం నలుగురే..

వరంగల్ వ్యవసాయం, మార్చి 19 : వ్యవసాయ మార్కెట్లలో పంటలకు గిట్టుబాటు ధర లభించనప్పుడు ఆ పంటను గోదాముల్లో నిల్వ చేసుకుని, దానిపై సదరు రైతులు రుణం పొందేందుకు వీలుగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రైతుబంధు (రుణసాయం) పథకాన్ని 20ఏళ్ల క్రితమే అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ మార్కెట్లలో రైతుల నుంచి పన్ను వసూలు చేయడమే కాదు.. రైతులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం రైతుబంధు పేరుతో రైతులకు రుణం ఇచ్చి ఆసరాగా నిలిచే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. పంటను అమ్మకానికి తీసుకువచ్చినప్పుడు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోతే... ఆ సమయంలో ఆ రైతు సరుకును మార్కెట్ కమిటీ గోదాముల్లో లేదంటే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుని ఆ రశీదును మార్కెట్ కమిటీలో అందజేసే, అధికారులు సదరు రైతు పంట సరుకు విలువలో 75శాతం, లేదా రూ.2లక్షలకు మించకుండా ఆరు నెలల వరకు వడ్డీలేని రుణాన్ని రైతుకు అందజేస్తారు. ఆ తరువాత రైతు పంటను మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించి తీసుకున్న రుణాన్ని మినహాయించుకుని మిగతా డబ్బులు రైతుకు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటారు.

కేటాయించింది రూ.28కోట్లు... ఇచ్చింది రూ.7.71లక్షలే..

మార్కెట్ రీజినల్ పరిధిలో 19 జిల్లాలు, 110 మార్కెట్ కమిటీలకు 2023-24 సంవత్సరానికి గాను రైతుబంధు పథకం కింద మార్కెటింగ్‌శాఖ రూ.28కోట్లు కేటాయించింది. అయితే ఇప్పటి వరకు వరంగల్ జిల్లాలో ఒక రైతుకు రూ.2లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో ఒక రైతుకు రూ.1.75లక్షలు, ఖమ్మం జిల్లాలో ఇద్దరు రైతులకు రూ.4లక్షలు కలిపి రైతుబంధు పథకం నలుగురు రైతులకు రూ.7.71లక్షలు మాత్రమే ఇచ్చారు. అయితే ఈ రైతుబంధు పథకంపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో పథకం నిర్వీర్యమవుతోంది. అధికారులు సైతం కల్పించడానికి ఆసక్తి చూపడం లేదు. రైతులకు అవగాహన కల్పిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. మంచి ధర వచ్చే వరకు సరుకునే దాచుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అసలే ఉద్యోగుల కొరతతో ఉన్న అధికారులకు ఇప్పటికే పని ఒత్తిడికి లోనవుతున్న క్రమంలో రైతుకు మంచి అవకాశాల గురించి చెప్పే ఓపిక లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



రైతులకు సేవలందిస్తున్నాం..

- మల్లేశం, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్

రైతుబంధు (రుణసాయం) పథకం కింద రైతులకు సేవలందిస్తున్నాం. ఈ సంవత్సరం ధాన్యం, మొక్కజొన్న, ఇతర ఉత్పత్తులకు ఎంఎస్‌పీ ధరల కంటే మార్కెట్లో ఎక్కువ ధరలు పలుకడంతో రైతులు రైతుబంధు పథకాన్ని వినియోగించుకో లేదు. సాధారణంగా రైతులు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో రైతుబంధు పథకం ద్వారా రుణం తీసుకుంటారు. ముఖ్యంగా మార్చిలో రైతులు రుణం తీసుకుంటుంటారు. రైతుబంధుపై మార్కెట్లో రైతులకు తెలిసేలా మైకుల ద్వారా అనౌన్స్ చేయిస్తున్నాం.



ఫోన్‌ట్యాపింగ్ ప్రకంపనలు

- ప్రణీత్‌రావు సొంత జిల్లా వరంగల్‌పై దృష్టిసారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం
- వార్‌రూం ఏర్పాటు చేసింది పర్వతగిరిలోనేని ప్రచారం
- కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు సీఐలను అదుపులోకి తీసుకున్నట్టు చర్చ
- వ్యవహారంలో జిల్లా నేతలున్నారంటూ అభియోగాలు

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాష్ట్రంలోనే సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం జిల్లాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. కీలకమలుపులు తిరుగుతున్న ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు వరంగల్ వైపు దృష్టి మళ్లించారు. వరంగల్ జిల్లా పర్వతగిరిలోని ఓ వ్యక్తి ఇంట్లో వార్‌రూమ్ ఏర్పాటు చేసి, ఫోన్ ట్యాపింగ్ చేశారనే ప్రచారం నేపథ్యంలో మం గళవారం తెల్లవారు జామునే వరంగల్‌లో పని చేస్తున్న ఇద్దరు సీఐల ను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే స్పెషల్ ఇంటిలిజెన్సీ బ్యూరో(ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఇచ్చిన సమాచారం మేరకే ఇద్దరు సీఐలను అదుపులో తీసుకున్నట్టు తెలిసింది. అయితే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పాత్రధారి అయిన ప్రణీత్‌రావు సొంత ఊరు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడిపల్లి కావటం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రణీత్‌రావు స్వగ్రామం మేడిపల్లి అయితే తన అమ్మమ్మ, అత్తగారి ఊరు పర్వతగిరి మండలం కేంద్రం. బాల్యం మొత్తం మేడిపల్లిలోనే గడిచినా ఆయనకు పర్వతగిరితోనే ఎక్కువ సత్సంబంధాలున్నాయని స్థానికులు పేర్కొంటునానరు. ఎస్ఐగా పోలీసుశాఖలో ఉద్యోగంలో చేరిన ప్రణీత్‌కు సాంకేతిక విద్యపై పూర్తిస్థాయిలో ఉన్న పట్టుతో స్పెషల్‌బ్రాంచ్‌లో పనిచేసి త్వరితగతిన పదోన్నతులు పొందినట్లుగా సమాచారం. అయితే ప్రణీత్‌రావు అత్తింటివారు, సంబంధీకులు మొత్తం చాలాఏళ్ల క్రితమే హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.

పర్వతగిరిలో వార్‌రూమ్?

గత ప్రభుత్వం హయంలో నాటి పీసీసీ నేత రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కీలక నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లుగా ఆరోపణలున్న కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును ఇటీవల హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆయన్ను విచారించిన పోలీసులు ఏఏ జిల్లాల్లో.. ఎక్కడెక్కడ వార్ రూమ్‌లు ఏర్పాటు చేశారని, సహకరించిన ఇన్‌స్పెక్టర్ల జాబితా, ధ్వంసం చేసిన కంప్యూటర్ హార్డ్‌డిస్కుల వివరాలను రాబట్టినట్టు సమాచారం. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా పర్వతగిరిలో కూడా వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్టు ప్రణీత్‌రావు చెప్పినట్టు సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొట్టింది. ఈ క్రమంలో ఆయనిచ్చిన సమాచారంతో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు సీఐలను అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తరలించి విచారిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పర్వతగిరిలో వార్ రూమ్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ఓ సీఐ నేతృత్వంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని తెలియరాగా.. ఈ వ్యవహారమంతా ఎలా జరిగిందనే కోణంలో విచారణ నిర్వహిస్తున్నట్టు సమాచారం. కాంగ్రెస్ నేతలతో పాటు కొందరు బీఆర్ఎస్ నేతలు, కీలక అధికారుల ఫోన్‌లు ట్యాప్ చేశారని, ఈ మొత్తం వ్యవహారంలో జిల్లాకు చెందిన ఓ ముఖ్య నేత కూడా ఉన్నారని ప్రచారం జరగడం, దర్యాప్తు బృందాలు వరంగల్‌పై నిఘా పెట్టడం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

ప్రణీత్‌రావు ఎవరో తెలియదని ఎర్రబెల్లి స్పష్టీకరణ

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రమేయం ఉందని ప్రచారం జరుగుతుండటం, సోషల్‌మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతుండటంపై ఆయన స్పందించారు. తనకు ప్రణీత్‌రావు ఎవరో తనకు తెలియదని మంగళవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. పర్వతగిరిలో ప్రణీత్‌రావుకు బంధువులు ఉండటం మూలంగా వచ్చి పోయేవాడని, తనను కొందరు కావాలనే ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. తానెవరికీ భయపడేది లేదని, తన పేరు చెప్పాలని ప్రణీత్‌రావుపై ఒత్తిడి తెస్తున్నారని ఎర్రబెల్లి పేర్కొనటంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మున్ముందు ఎలాంటి మలుపులు తిరుగుతుందోనన్న చర్చ జరుగుతోంది.

మంగళవారం ఉష్ణోగ్రతలు	
గరిష్ఠం : 31.0°C	కనిష్ఠం : 22.0°C

రంజాన్ వేళలు		
ఇఫ్తార్ :	బుధవారం	సా : 6.33 గం..
సహర్ :	గురువారం	ఉ : 4.58 గం..



శ్రీకృష్ణా కాలనీలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఏసీపీ

రెండోరోజూ 'పది' పరీక్షలు ప్రశాంతం

- జిల్లాలో 99.8శాతం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: పదవ తరగతి రెండో రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం హిందీ పరీక్షకు జిల్లాలో 99.8శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 9,439 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 9,420 మంది హాజరయ్యారు. వరంగల్‌లోని ప్లాటినం జూబ్లీ పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సంధ్యారాణి సందర్శించగా, డీఈవో వాసంతి 5 కేంద్రాలను సందర్శించారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 46 కేంద్రాలను తనిఖీలు చేశాయి. సీపీ మర్కజీ పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరీక్ష సమయంలో పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని అక్కడున్న పోలీసులకు సూచించారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఏసీపీ

వరంగల్ చౌరస్తా : ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీకృష్ణా కాలనీలోని ప్రభుత్వ కళాశాలలో పదో తరగతి పరీక్షల సెంటర్ కొనసాగుతుండటంతో పరీక్షలు ప్రశాంతంగా జరుగాలని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అన్నారు. మంగళవారం శ్రీకృష్ణా కాలనీలోని కళాశాలను సందర్శించి పరిస్థితులను పర్యవేక్షించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగాలని ఏసీపీ సూచించారు. సీఐ మచ్చ శివకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు..

- ఫోన్ ట్యాపింగ్ కేసులో నన్ను ఇరికించే కుట్ర
- అవినీతిపరులే బీఆర్‌ఎస్‌ను వీడుతున్నారు..
- ఆందోళన వద్దు.. శ్రేణులకు అండగా ఉంటాం..
- ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాంనగర్, మార్చి19: తాను పార్టీ మారే ప్రసక్తే లేదని, గిట్టని వారు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడారు. అవినీతిపరులు ఆస్తులు కాపాడుకునేందుకు బీఆర్ఎస్‌ను వీడి అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆరోపించారు. అవకాశవాదులు పోయినంతమాత్రాన ఆందోళ చెందాల్సిన అవసరం లేదని, తాము కేడర్‌కు అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కలిసి పనిచేసి పార్టీని బలోపేతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓ మోసకారి అని, ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాడని ఆయన ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక చేతులెత్తేశాడని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అవగాహన రాహిత్యంతో రైతుల పంటలు ఎండుతున్నాయని ఆయన అన్నారు. కాళేశ్వరం పిల్లర్లు కుంగాయని సాకు చూపి నీళ్లు ఆపారని ఆయన ఆరోపించారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, పార్టీలోనే ఉంటానని, బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వచ్చేందుకు తన వంతు పాత్ర పోషిస్తానని ఎర్రబెల్లి పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకు సంబంధం లేదని, వార్‌రూమ్ అనే విషయం తనకు తెలియదన్నారు. ప్రణీత్‌రావు అమ్మమ్మ ఊరు పర్వతగిరి అని, ఆయనకు తనతో ఎలాంటి పరిచయం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో తనను ఇరికించే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న కావ్యను గెలిపించుకుందామని దయాకర్‌రావు శ్రేణులకు పిలుపునిచ్చారు.



ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఎర్రబెల్లి, వినయభాస్కర్

హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఫొటో పెట్టుకుని విజయం సాధించి, అధికారాన్ని అనుభవించి స్వలాభం కోసం పార్టీని వీడటం సిగ్గుచేటన్నారు. చెట్టుకు ఎండిన ఆకులు రాలిపోతున్నాయని, చెట్టు, వేర్లు బలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. మళ్లీ చెట్టు చిగురిస్తుందని, కాయలు కాస్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో చోటా భాయ్, కేంద్రంలోని బడా భాయ్ కలిసి కేసీఆర్‌పై కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తాను ఫుల్‌టైమ్ పొలిటీషియన్‌నని ఆయన తెలిపారు. పార్ట్‌టైమ్ పొలిటీషియన్‌లు పార్టీ మారినంతమాత్రాన జరిగే నష్టం లేదని వినయభాస్కర్ పేర్కొన్నారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. తనకు అవకాశం ఇచ్చిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. వరంగల్ నుంచి ఎంపీగా తాను విజయం సాధిస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ పోచం పల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు కె.వాసుదేవరెడ్డి, సుందర్‌రాజ్, లలితాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేసిన తప్పును ప్రజలు గుర్తించారు..

- దొంగ హామీలను నమ్మి బీఆర్‌ఎస్‌ను ఓడించారు
- ఆస్తులు కాపాడుకునేందుకు నేతలు పార్టీని వీడుతున్నారు
- ఆందోళన వద్దు.. కార్యకర్తలను కాపాడుకుంటాం..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- వర్ధన్నపేట నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం

రోగుల వివరాలు, సేవల్ని ఆన్‌లైన్ చేయాలి


- ఆయుష్ అదనపు డైరెక్టర్ పరమేశ్వర్‌నాయక్

గిర్మాజీపేట, మార్చి 19 : ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల రోగుల వివరాలు, చికిత్స, వైద్యులు, సిబ్బంది పనితీరును నిత్యం ఆన్‌లైన్ చేయాలని రాష్ట్ర ఆయుష్ అదనపు డైరెక్టర్ డాక్టర్ పరమేశ్వర్‌నాయక్ ఆదేశించారు. మంగళవారం వరంగల్‌లోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్టీ జోన్-1 పరిధిలోని ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయుష్ వరంగల్ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ రవినాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరమేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఆయుష్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే వెల్‌నెస్ సెంటర్లలో వైద్యులు, సిబ్బంది, మందుల పంపిణీని ప్రభుత్వం పటిష్టం చేసిందన్నారు. మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది రోజు వారి బయోమెట్రిక్ అటెండెన్స్, సెలవుల అర్జీలు, మందుల ఇండెంట్ కూడ ప్రతి రోజు ట్యాబ్‌లో ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్ కమిషనరేట్ టెక్నికల్ అధికారి డి.ప్రవీణ్, అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రామారావు, మల్టీజోన్-1 పరిధిలోని ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



ట్యాబ్‌లు ఇస్తున్న దృశ్యం

ఆమ్.. ఆగయా..



- మార్కెట్‌కు కొత్త మామిడికాయలు
- లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌కు బంగినపల్లి మామిడి
- క్వింటాకు రూ.6వేలు

వరంగల్ వ్యవసాయం, మార్చి 19: వరంగల్ లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌కు మంగళవారం కొత్త మామిడికాలు వచ్చాయి. ఈ సీజన్ ఇదే తొలిసారి రావడం. ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన రైతు నాగేశ్వర్ యాదవ్ ఐదు క్వింటాళ్ల బంగినపల్లి మామిడికాయలు అమ్మకానికి తీసుకువచ్చాడు. మార్కెట్లో మహాలక్ష్మి ఫ్రూట్ కంపనీ యజమాని చెన్నమల్లు యాదవ్ క్వింటాకు ఆరు వేల చొప్పున కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో మామిడి అమ్మకాలు ఇదే మొదలు కావడంతో వ్యాపారులు ఆసక్తిగా చూశారు. సాధారణంగా మార్కెట్‌కు మార్చిలో మామిడి మార్కెట్ ప్రారంభమవుతుంది. బంగినపల్లి, తోతపరి, పెద్ద రసాలు, చిన్న రసాలు, హిమాయత్, నాటి వైరిటీ తదితర రకాలను రైతులు అమ్మకానికి తీసుకువస్తుంటారు. వరంగల్ జిల్లాలో 6,500 ఎకరాలు, హనుమకొండ జిల్లాలో 5వేల ఎకరాలలో మామిడి సాగు చేస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు. మార్కెట్‌లో ఏటా పెద్ద ఎత్తున మామిడి అమ్మకాలు జరుగుతున్న నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు ఖమ్మం, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల రైతులు సైతం వరంగల్ పండ్ల మార్కెట్‌కే అమ్మకానికి తీసుకువస్తుంటారు. ఇక్కడికి మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యాన, జమ్ము, పంజాబ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ల నుంచి హోల్‌సేల్ వ్యాపారులు వచ్చి ఏకంగా మామిడి సీజన్ అయిపోయేంత వరకు ఇక్కడే మకాం వేసి కాయలు కొనుగోలు చేస్తుంటారు. ఏడాది లక్ష్మీపురం మార్కెట్లో మమిడికాయల అమ్మకంపై మార్కెట్ ఫీజు రూపేనా సుమారు రూ. 25 లక్షల ఆదాయం సమకూరింది.



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మామిడికాయలు

రాలిన పూత, కాత

ఈ సీజన్‌లో గాలివానకు మామిడి పూత రాలిపోయింది. దీంతో రైతులు పంట చేతికి వచ్చేసమయంలో గాలి, వానలతో నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో మామిడి సాగు మంచి పూత, పిందెతో తోటలు కళకళలాడుతున్న సమయంలో అకస్మాత్తుగా కురిసిన భారీ వడగళ్లు, వర్షాలకు, గాలులకు మామిడి చెట్లు, కొమ్మలు విరిగిపోయాయి.

పూత, పిందె, కాయలు పడిపోయింది. కాగా, గత సీజన్‌లో గరిష్ట ధర టన్నుకు రూ.55వేలు పలికింది. లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌కు మొత్తం లక్షా 37వేల137 క్వింటాళ్ల మమిడికాయలు అమ్మకానికి వచ్చింది.

గత సీజన్‌లో మామిడి ధరలు ఇలా..

నెల	క్వింటాళ్లు	గరిష్ట ధర	కనిష్ట ధర
మార్చి	3,788	5,500	1,200
ఏప్రిల్	37,328	4,000	800
మే	84,333	4,000	700
జూన్	11,664	4,000	700



శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించండి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19: గ్రేటర్ వరంగల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శానిటేషన్, నీటి సరఫరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు ప్రాంతాలను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌తోపాటు పలు కాలనీలలో పర్యటించారు. ఇంకా వరంగల్ బ్యాంకు కాలనీ, దేశాయిపేట, ఎల్బీనగర్, గొల్లవాడ, పద్మనగర్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి నీటి సరఫరాపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజు ఎంత సమయం నీరు సరఫరా అవుతోంది? అధికారులు పర్యవేక్షిస్తున్నారా? నీటి పన్నులు చెల్లిస్తున్నారా? అని ప్రత్యక్షంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా శానిటేషన్ పర్యవేక్షణలో భాగంగా ఇదే ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. ఉదయం ఎన్ని గంటలకు విధులకు హాజరువుతున్నారు? సకాలంలో జీతాలు వస్తున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నీరును అవసరానికి మించి వాడకూడదని, ఎండాకాలంలో అందరికీ నీరు చాలా అవసరం అన్నారు. నీటి వృథాను అధికారులు అరికట్టి లీకేజీలను మూసివేయాలని సూచించారు. నల్లాలకు ఆన్, ఆఫ్ వ్యవస్థ తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లైన్‌మెన్‌లు ఎన్నటికప్పుడు లీకేజీలను గుర్తించి అధికారులకు తెలియచేయాలని అన్నారు. కమిషనర్ వెంట ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో మల్లం రాజేశ్, ఈఈ శ్రీనివాస్, శానిటరి సూపర్‌వైజర్ సాంబయ్య, డీఈలు సిరిమల్లె సారంగం, రంగారావు, కృష్ణమూర్తి, రవీందర్, ఏఈలు సౌజన్య, సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎల్లస్వామి, శ్యాంరాజ్, ధరంసింగ్‌లు ఉన్నారు.



పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, మార్చి 19: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 20, 21, 22, తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. బుధ, గురు, శుక్ర వారం మూడు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

న్యాక్ జాతీయ సదస్సులో వీసీ రమేశ్



న్యాక్ జాతీయ సదస్సులో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఇతర అధికారులు

కేయూ క్యాంపస్, మార్చి 19: విద్యాసంస్థల స్వయం సమృద్ధితో విద్యా విధానాల్లో చేపడుతున్న విధానపరమైన నిర్ణయాలపై మంగళవారం దేశ వ్యాప్తంగా బెంగళూరలోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్ నుంచి సదస్సులో పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల కోసం న్యాక్ అధికారులు దేశంలోని వివిధ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్లు, జాతీయ సంస్థల డైరెక్టర్లు, అటానమస్ కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. రాబోయో రోజుల్లో న్యాక్ అక్రిడేషన్ విధానం, ప్రస్తుతం ఉన్న విధానంలో చేపడుతున్న విధానపరమైన నిర్ణయాలు, అక్రిడేషన్ పొందిన విద్యాసంస్థలకు వచ్చే ప్రయోజనాలతోపాటు విద్యార్థులకు కల్పించాల్సిన, సమాజానికి అవసరమైన విద్యాసంస్థల స్వయం సంమృద్ధి కోసం చేయాల్సిన బాధ్యతలు చర్చించారు. డిజిటలీకరణ, అకడమిక్ క్రెడిట్స్, ఫిర్యాదుల పరిష్కారం యంత్రాంగం, అభిప్రాయ సేకరణ, విద్యాసంస్థల్లో ఉన్న ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ పనితీరుపై చర్చించారు. జాతీయ విద్యావిధానంలో పొందుపరిచిన లక్ష్యాలను అందుకునేందుకు దృష్టి పెట్టాల్సిన అంశాలనూ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, కేయూ క్వాలిటీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, ప్రొఫెసర్ ఎన్.గోపి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నిట్ విద్యార్థి దుర్మరణం



క్షితిజ్ రాజ్ (ఫైల్)

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: అతి వేగం ఓ టెక్నోక్రాట్‌ను బలితీసుకుంది. కారును అతి వేగంగా నడపడం వల్ల సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని తార్నాక వైజంక్షన్‌లో డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో వరంగల్ నిట్ విద్యార్థి క్షితిజ్‌రాజ్(22) దుర్మరణం పాలయ్యాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన క్షితిజ్‌రాజ్ నిట్‌లో ఈఈఈ నాలుగో సంవత్సరం చదువుతు న్నాడు. ఈ ఘటనలో మరో నలుగురు నిట్ విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వివరాల్లోకి వెళితే.. స్నేహితుడి ఇంటర్వ్యూ కోసం సోమవారం వరంగల్ నుంచి సెల్ఫ్ డ్రైవింగ్ కార్‌ను అద్దెకు తీసుకొని క్షితిజ్‌రాజ్, ఈసీఈ నాలుగో సంవత్సరం విద్యార్థి హర్షిత్ మహేశ్వరి, ఈఈఈ నాలుగో సంవత్సరం విద్యార్థి అర్జుతన్వర్, ఎంఎంఈ నాలుగో సంవత్సరం విద్యార్థి నవీన్ దవన్, ఎం ఎంఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కపిల్ హైదరాబాద్ వెళ్లారు. తార్నాక సమీపంలోని పీఎస్ వై జంక్షన్ సమీపంలో రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో అతివేగంగా నడుపుతున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో క్షితిజ్‌రాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మిగతా నలుగురు విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తార్నాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిట్ విద్యార్థి రోడ్డు ప్రమాదంతో దుర్మరణం పాలవడంతో నిట్‌లో ఒక్క సారిగా విషాదఛాయలు అలముకొన్నాయి.















సరిహద్దుల్లో అలజడి

మహారాష్ట్ర రేపనపల్లి అడవుల్లో ఎదురుకాల్పులు ● నలుగురు మావోయిస్టుల మృతి

మహదేవపూర్, మార్చి 19: పార్లమెంటు ఎన్నికల వేళ తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దుల్లో మంగళవారం తెల్లవారుజామున అలజడి రేగింది. సుమారు రెండున్నర గంటలపాటు పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన హోరాహోరీ ఎదురుకాల్పుల్లో తెలంగాణకు చెందిన నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. గడ్చిరోలి జిల్లా రేపనపల్లికి సౌత్ ఈస్ట్ ప్రాంతంలో 8 కిలోమీటర్ల దూరంలోని కొలమార్క గుట్టల్లో ఈ ఘటన జరిగింది. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో మావోయిస్టుల కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతుందన్న పక్కా సమాచారంతో అహేరీ అదనపు ఎస్పీ యతీశ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలో పెద్దఎత్తున పోలీసు బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. తెల్లవారుజామున ఒక డెన్‌లో ఉన్న మావోయిస్టులను చుట్టుముట్టిన పోలీసులు కాల్పులు ప్రారంభించగా మావోయిస్టులు ఎదురుకాల్పులకు దిగడంతో సుమారు రెండున్నర గంటల పాటు కొలమార్కు గుట్టల ప్రాంతంలో తుపాకీ చప్పుళ్లతో పరిసర ప్రాంతాలు దద్దరిల్లాయి. కాల్పులు ముగిసిన తర్వాత పోలీసులు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించగా ఈ ఘటనలో తెలంగాణలోని మంగీ- ఇంద్రవెల్లి ఏరియా కమిటీ సభ్యుడు, కొమురంభీం మంచిర్యాల డివిజన్ కమిటీ సభ్యుడు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన వర్గీస్(28), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భైరాన్‌ఘర్ జిల్లా కొత్రాంకు చెందిన జిల్లా కమిటీ సభ్యుడు, సిర్పూర్ - చెన్నూరు కార్యదర్శి పాండు అలియాస్ మంగులు (32), ప్లాటూన్ మెంబర్లు కురుసంగి రాజు , కుడిమేత వెంకటేశ్ మరణించినట్లు గుర్తించారు. సంఘటనా స్థలంలో ఏకే 47 రైఫిల్ ఒకటి, ఒక కార్బన్, మరొక కంట్రీమేడ్ పిస్టల్, మావోయిస్టుల సాహిత్యం, పేలుడు పదార్థాలు, వంట సామగ్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాల్పులు జరిగిన సంఘటనా స్థలం నుంచి మరికొంతమంది మావోయిస్టులు తప్పించుకొని వెళ్లారని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఈ నలుగురిపై మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం రూ. 36లక్షల రివార్డును ప్రకటించడం విశేషం. ఇక తప్పించుకున్న మావోయిస్టులు ఏయే ప్రాంతాలవైపు వెళ్లే అవకాశం ఉందన్న పక్కా ప్రణాళికలతో పోలీసులు సరిహద్దు ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. కొలమార్క గుట్టలతో పాటు సమీపంలోని అటవీ ప్రాంతంలో నిఘా వ్యవస్థను పటిష్టపరిచి తప్పించుకున్న మావోయిస్టులను మట్టుబెట్టడమే లక్ష్యంగా పోలీసులు కూంబింగ్ చేస్తున్నారు.

టెన్షన్.. టెన్షన్..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన 72 గంటల్లోపే మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగిన నేపథ్యంలో రెండు రాష్ట్రాల పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టుల కట్టడికి కూంబింగ్ చేపట్టారు. అలాగే రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు సమన్వయంతో పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎదురుకాల్పుల్లో గాయపడిన మావోయిస్టులు చికిత్స కోసం తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉండడంతో గోదావరి తీర ప్రాంతం వెంట పటిష్ఠ భద్రతను అప్రమత్తం చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఇక తాజా ఘటనలో కీలకంగా వ్యవహరించిన స్పెషల్ ఐజీ సందీప్ పాటిల్, గడ్చిరోలి జోన్ డీఐజీ అంకిత్ గోయల్, సీఆర్‌పీఎఫ్ డీఐజీ జగదీష్ మీనా, గడ్చిరోలి ఎస్పీ నీలోత్పల్‌లను ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న వారి ఉన్నతాధికారులు ప్రశంసించారు.



కొలమార్క గుట్టల నుంచి మావోయిస్టు మృతదేహాన్ని హెలీక్యాప్టర్‌లో గడ్చిరోలికి తీసుకొచ్చిన పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

అంతర్రాష్ట్ర వంతెనపై పోలీసుల తనిఖీలు

మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగిన నేపథ్యంలో అప్రమత్తమైన కాళేశ్వరం పోలీసులు అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోకి వస్తున్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. గోదావరి మీదుగా మావోయిస్టులు తెలంగాణలోకి వచ్చే అవకాశం ఉండడంతో గ్రామస్థులకు అవగాహన కల్పించి.. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే సమాచారం అందించాలని సూచిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లను మహదేవపూర్ సిఐ రాజేశ్వర్‌రావు, కాళేశ్వరం ఎస్సై భవానీసేన్ పర్యవేక్షిస్తున్నారు.

ఉద్యమకారులతో
బీఆర్ఎస్ నేతల చర్చలు

- కడియం కావ్యను మార్చాలని ఉద్యమకారుల డిమాండ్
- అదిష్ఠానం దృష్టికి తీసుకెళతామన్న నేతలు
- లేదంటే కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరిక

రాంనగర్, మార్చి19: వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యమకారులతో బీఆర్ఎస్ నేతలు దాస్యం వినయ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, సుందర్ రాజ్ భేటీ అయ్యారు. మంగళవారం నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో భేటీ అయిన నేతలు.. నిరసన గళం వినిపిస్తున్న ఉద్యమకారులు బోడ డిన్నా, జోరిక రమేశ్, బండి రజనీకుమార్, వీరేందర్, చింతల యాదగిరితో చర్చలు జరిపారు. పార్టీలో సభ్యత్వంలేని, రాజకీయంగా ఎలాంటి అనుభవం లేని కడియం కావ్యను ఎలా అభ్యర్థిగా ప్రకటిస్తారని ఉద్యమకారులు ప్రశ్నించారు. తమలో ఒకరికి అవకా శం ఇవ్వాలని చేస్తున్న అభ్యర్థనను ఏ మాత్రం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమం జసమని వారు నేతలను ప్రశ్నించారు. ఒకే ఇంట్లో నుంచి ఇద్దరికి పదవులు ఇవ్వాల్సిన అవసరం ఏంటని వారు నేతల దృష్టికి తీసుకువచ్చారు. వారంరోజుల్లో కడియం కావ్యను మార్చి తమలో ఎవరికైనా అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. తమ అభ్యర్థనను పార్టీ అధిష్ఠానం పట్టించుకోకుంటే జయశంకర్ విగ్రహం వద్ద ప్రెస్‌మీట్ పెట్టి కార్యాచరణ ప్రకటిస్తామని నేతలకు తేల్చిచెప్పారు. కాగా, ఉద్యమకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అధిష్ఠానం దృష్టికి తీసుకెళతామని నేతలు పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు. అధిష్ఠానం సూచించిన అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని నేతలు పేర్కొన్నారు.

క్రషర్స్ యజమానులకు సమస్యలు పరిష్కరించాలి



డీడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి19: మైనింగ్ శాఖ ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లును కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న డీడీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్టోన్ క్రషర్స్ యజమానులకు ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు డీడీ వెంకటేశ్వర్లును కోరారు. అనంతరం మైనింగ్ శాఖ హనుమకొండ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సాంబశివరావును కలిశారు. కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుల పేరాల మదుసూధన్ రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.నరేష్, స్టోన్ క్రషర్స్ యజమానులు దేవేందర్ రెడ్డి, రాంరెడ్డి, సుజిత్‌రావు తదితరులు డీడీని కలిసిన వారిలో ఉన్నారు.

నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: విదేశాల్లో ఎంఎస్, పీహెచ్‌డీ కోర్సులు చదివేందుకు నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత విభాగం ప్రకటన జారీ చేసింది. 2024-25 సంవత్సరానికి ఎంపిక కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. www.nosmsje.gov.in అనే వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వారు పేర్కొన్నారు.

చేసిన తప్పును ప్రజలు ప్రజలు గుర్తించారు..

● దొంగ హామీలను నమ్మి బీఆర్ఎస్‌ను ఓడించారు.. ● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాంనగర్, మార్చి 19: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి తప్పు చేశామని రాష్ట్ర ప్రజలు గుర్తించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో ఇప్పటి వరకు కేవలం రెండు హామీలు మాత్రమే అమలు చేశారని ఆయన చెప్పారు. రేవంత్‌రెడ్డికి మాయమాటలు చెప్పడం మొదటి నుంచి అలవాటేనన్నారు. అవినీతి చేసిన నేతలు ఆస్తులు కాపాడుకు నేందుకు పార్టీ మారుతున్నారని ఆయన ధ్వజ మెత్తారు. కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎర్రబెల్లి పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు వినయ భాస్కర్ మాట్లాడుతూ.. స్వలాభం కోసం నేతలు పార్టీ మారుతున్నారని ఆరోపిం చారు. శ్రేణులు వారివెంట వెళ్లడం లేదన్నారు. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేదీ లేదని అన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు బలమైన కేడర్ ఉందన్నారు. ఎవరో కొందరు పార్టీ వీడినంత మాత్రాన జరిగే నష్టం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామన్నారు. కార్యకర్తలు ఆందోళనకు గురికావద్దని సూచించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్, వాసుదేవ రెడ్డి, లలితాయాదవ్, కడియం కావ్య, ఇండ్ల నాగేశ్వర్‌రావు, చింతల యాదగిరి వర్ధన్నపేట నియోజకవర్గ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కాగా, ఈ సందర్భంగా పలువురు వర్ధన్నపేట బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. పదేళ్ల పదవులు అనుభవించి, ఆస్తులు కాపాడుకోవడానికి పార్టీ వీడటం ఎంతవరకు సమంజసమని అరూరి రమేశ్‌ను ఉద్దేశించి అన్నారు. నమ్ముకున్న వారిని నట్టేట ముంచి తన స్వలాభం చూసుకున్నాడని విమర్శించారు. పార్టీ మారిన వారితో నష్టం లేదని, భవిష్యత్‌లో కలిసికట్టుగా పనిచేసి వర్ధన్నపేటలో బీఆర్ఎస్‌ను పటిష్టం చేస్తామని వారు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

లాసెట్ ద్వారా ఎంజేపీ లా కళాశాలల్లో ప్రవేశాలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో నెలకొల్పిన రెండు లా కళాశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న లా సెట్ ర్యాంకు ద్వారానే సీట్లు కేటాయించనున్నట్లు ఎంజేపీ ఆర్సీవో మనోహర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మహేశ్వరంలో బాలుర రెసిడెన్షియల్ లా కళాశాల, కాజీపేటలో నెలకొల్పిన బాలికల రెసిడెన్షియల్ లా కళాశాలలో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు కళాశాలల్లో 5 ఏళ్ల లా కోర్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇంటర్ పాసై లా సెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా సీట్లు పొందవచ్చునని తెలిపారు. కాగా, లాసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకు గడువు ఉందని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వేలేరు(ధర్మసాగర్)మార్చి 19: వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చ లేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ.హరిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీచర గ్రామానికి చెందిన పిట్ల సుధాకర్(43) తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో కొన్నేళ్ల నుంచి మొక్కజొన్న, వరి పంటలను సాగు చేస్తున్నాడు. వ్యవసాయ బావిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రూ.10లక్షలు అప్పులు చేసి బావిలో సైడ్‌బోర్లను సైతం వేయించాడు. దీంతో పాటు అప్పులు చేసి తన కూతురు రవళి వివాహం చేశా డు. వ్యవసాయంతో చేసిన అప్పులు తీర్చాలనుకున్నప్పటికీ సాగు చేసిన పంటకు సాగు నీరు లేకపోవడంతో దిగుబడి రాలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చడం ఎలా అని మనస్తాపం చెంది వ్యవసాయ బావి వద్దకు సోమవారం రాత్రి వెళ్లి సుధాకర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న సుధాకర్‌ను చుట్టు పక్కల రైతుల గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చే సరికే సుధాకర్ మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు విచ్చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కూతురు, కుమారుడు ఉన్నాడు.



రైతు సుధాకర్ (ఫైల్)

పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్లు కనిపిస్తే చర్యలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు కనిపిస్తే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని డీఈవో డాక్టర్ అబ్దుల్ హై మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మంగళవారం ఉదయం పరీక్షకు ముందు నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో పరీక్షా కేంద్రాల నిర్వాహకులు సీఎస్, డీవోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు ఇతరత్రా నిర్వాహకులు సెల్‌ఫోన్లను పరీక్షాకేంద్రంలోకి తీసుకెళ్లరాదని ఆయన స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన వాహనాలు, హెడ్మాస్టర్ల గదులు, బాత్‌రూమ్‌లలో ఎక్కడా సెల్‌ఫోన్‌లు లేకుండా చూడాలని సెట్ కాన్ఫరెన్స్‌లో స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఆయన ప్రకటనలో హెచ్చరించారు. హనుమకొండ జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా సెల్‌ఫోన్లు వినియోగించినట్లు తన దృష్టికి రాలేదని ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

● మేడారం విధులు ముగించుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదం ● 20రోజులుగా మృత్యువుతో పోరాటం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బొట్ల దేవానంద్ (40) అనే పారిశుధ్య కార్మికుడు మంగళవారం మృతిచెందాడు. 20 రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన బొట్ల దేవానంద్ 20 యేళ్లుగా నగర పాలక సంస్థలో శానిటేషన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల సునిల్ పరిధిలో పని చేస్తున్నాడు. కాగా, మునిసిపల్ అధికారుల ఆదేశాల మేరకు ఫిబ్రవరి 15 నుంచి 29 వరకు మేడారం జాతరలో విధులు నిర్వర్తించాడు. జాతర విధులు ముగించుకుని 29న సాయంత్రంస్వచ్ఛభారత్ ఆటోను నడుపుకుంటూ నగరానికి వస్తున్నాడు. ఈ క్రమంలో ములుగు జిల్లా గట్టమ్మ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన లారీ దేవానంద్ ఆటోను ఢీకొట్టి వెళ్లిపోయింది. దేవా నంద్ కాళ్లు విరిగి కడుపులో బలమైనగాయాలయ్యాయి. అక్కడి వారు గుర్తించి 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని డాక్టర్లు సూచించారు. దీంతో హైదరా బాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయినా వైద్యానికి శరీరం సహకరించకపోవడంతో మంగళవారం మృతి చెందాడు. దేవానంద్ చికిత్సకు ఇప్పటివరకు రూ.10లక్షల వరకు ఖర్చు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుటుంబానికి ఏ అధికారులు, ఏ సంఘం నాయ కులు సహకరించలేదని, ఆర్థికంగా చితికిపోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మృతునికి కుటుంబం కన్నీరు మున్నీరయ్యారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.



దేవానంద్(ఫైల్)



మృతుడి ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ల నియామకానికి కసరత్తు

మంత్రుల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

హనుమకొండ టౌన్, మార్చి19: బీఆర్ఎస్ హయాంలో నియామకమైన ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లను కాంగ్రెస్ ప్రభుత్వం తొలిగించింది. ఇప్పుడు కొత్త (ఫైనాన్స్, ఆపరేషన్స్, ప్రాజెక్ట్స్, హెచ్‌ఆర్ అండ్ ఐఆర్) డైరెక్టర్లను నియమించేందుకు ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో డైరెక్టర్లుగా పనిచేసేందుకు ఎన్పీడీసీఎల్‌తో పాటు, ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కోలో పని చేస్తున్న చాలామంది సీఈలతో పాటు రిటైర్డ్ సీఈలు ఈనెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్నారు. సర్వీసులో ఉన్నవారైతే ఎస్ఈ, సీఈగా కలిపి ఐదేళ్లు, మొత్తంగా 15 ఏళ్లు సర్వీసు పూర్తయి ఉండాలని, రిటైర్డ్ అధికారులైతే 62 ఏళ్లు దాటకూడదని షరతు విధించింది. ఈ నిబంధనల ప్రకారం ఒక్కో డైరెక్టర్ పోస్టుకు 10 నుంచి 15 మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. సీఎండీ అధ్యక్షతన ఏర్పాటయ్యే ప్రత్యేక కమిటీ ఇంటర్వ్యూ ఆధారంగా ఒక్కొక్క డైరెక్టర్ పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేస్తారు. వీరి పేర్లను సీల్డ్‌కవర్‌లో సంబంధిత మంత్రితో పాటు సీఎం దృష్టికి పంపిస్తే ముగ్గురిలో ఒక్కరిని ఖరారు చేసి ఎన్పీడీసీఎల్‌కు సమాచారం ఇస్తారు. కంపెనీ డైరెక్టర్ పేరును ప్రకటించి ఆఫర్ లేఖను మంజూరు చేస్తుందని ఎన్పీడీసీఎల్ సీనియర్ అధికారులు చెబుతున్నారు.

కాగా, డైరెక్టర్ పోస్టులను చేజిక్కించుకునేందుకు ఇప్పటికే పలువురు పావులు కదుపుతున్నారు. సంబంధిత మంత్రిని ప్రసన్నం చేసుకునేందుకు కాంగ్రెస్ నేతలతో పాటు సన్నిహితులతో పైరవీలు చేస్తున్నారు. ఇదిలా వుండగా, ఎలక్షన్ కోడ్ రాకముందే నోటిఫికేషన్ జారీ, దరఖాస్తుల ప్రక్రియ ముగిసినందున నియామకాలకు ఎలాంటి అడ్డంకి రాదని పలువురు అభిప్రాయ పడుతు న్నారు. ఒక వేళ అడ్డంకిగా మారితే నియామకానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.



కమిషనర్ అతిథి గృహానికి పాత కమిషనర్ పేరుతో ఉన్న నేం బోర్డు

బోర్డుపై పేరు మారలే..

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు కొత్త కమిషనర్ వచ్చినా అధికారులు మాత్రం ఇంకా బోర్డులు మార్చలేదు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పేరును రాయడంలో కిందస్థాయి అధికారులు అలసత్వం వహిస్తున్నారు. హనుమకొండ బాలసముద్రంలో కమిషనర్ అతిథి గృహం ప్రధాన ద్వారానికి పాత కమిషనర్ రిజ్వాన్ బాషా షేక్ అనే పేరుతో ఉన్న గుర్తింపు ప్లేట్లను అధికారులు ఇంకా తొలగించలేదు.



కమిషనర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిసిన అధికారులు, అర్చకులు

వరంగల్ కల్చరల్, మార్చి19: రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారి హన్మంతరావును జిల్లాకు చెందిన దేవాదాయ శాఖ అధికారులు శ్రీభద్రకాళి అమ్మవారి దేవస్థానం అధికారులు, అర్చకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన హన్మంతరావుకు అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని హైదరాబాద్‌లో కమిషనర్ చాంబర్‌లో అందజేశారు. త్వరలో ఆలయాన్ని సందర్శిస్తానని కమిషనర్ తెలిపినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారిణి శేషు భారతి తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో దేవాదాయ శాఖ వరంగల్ జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఏసీ రాయల సునీత, భద్రకాళి దేవస్థానం ఈవో సహాయ కమిషనర్ శేషు భారతి, ప్రధానార్చకులు శ్రీభద్రకాళి శేషు, ఆలయ అర్చకులు సత్యం, అరవింద్ పాల్గొన్నారు.

'మౌలిక వసతులు కల్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రవి

ఖిలావరంగల్, మార్చి 19: రామసురేందర్ నగర్(జక్కలొద్ది గుడిసెకాలనీ) వాసులకు మౌలిక వసతులను కల్పించాలని, అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాలను అమలుచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. మంగళవారం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో, రామసురేందర్‌నగర్ కాలనీ, సీపీఐ నాయకుడు రామ సందీప్ అధ్యక్షతన జక్కలొద్ది సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జక్కలొద్దిలో ఏళ్ళతరబడి నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న గుడిసేవాసులకు రోడ్డు, విద్యుత్‌దీపాలు, డ్రైయినేజీలు, త్రాగునీరు, తదితర మౌలిక వసతులను కల్పించాలన్నారు. ప్రజాపాలనలో భాగంగా నిరుపేదలైన జక్కలొద్ది గుడిసేవాసులకు పట్టాలిచ్చి ఇందిరమ్మ పథకం క్రింద రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే బాషుమియా మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ రేషన్‌షాపును ఏర్పాటు చేసి బియ్యం, పించన్‌ల అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, నాయకులు సంగి ఏలేందర్, యాకాంబ్రా చారి, రాజేందర్, గజ్జ చందు పాల్గొన్నారు.

అద్దె ఇళ్లల్లో పేకాట



● పలుచోట్ల వ్యభిచారం ● యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు ● యజమానులను హెచ్చరిస్తున్న పోలీసులు

మట్టెవాడ, మార్చి 19: నగరంలో అద్దె ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి. ముఖ్యంగా పేకాట, వ్యభిచారం, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలతో నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా శివారు కాలనీలోనే ఎక్కువగా ఇలాంటి పనులు జరుగుతున్నాయి. అలాగే రామన్నపేట, కొత్తవాడ, డాక్టర్స్ కాలనీ, దేశాయిపేట, ఏనుమాముల, కోటి లింగాల రోడ్డు, కీర్తి నగర్ కాలనీ, సుందరయ్య నగర్, ఖిలా వరంగల్, ఉర్సు, కరీమాబాద్, హంటర్‌రోడ్డు, లేబర్ కాలనీ, గిర్మాజీపేట తదితర ప్రాంతాల్లో యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంత వాసులు వాపోతున్నారు. వరంగల్ మట్టెవాడ ప్రాంతంలోని కాకతీయ థియేటర్ సమీపంలో ఆరెన్నెళ్ల క్రితం వ్యభిచారం నిర్వహిస్తున్న సమాచారంతో పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. అదే విధంగా వరంగల్ స్టేషన్‌రోడ్డు, బీట్‌బజార్, హండర్ బ్రిడ్జి రోడ్డులో, వరంగల్ చౌరస్తా తదితర ప్రాంతాల్లోని లాడ్జీలలో యథేచ్ఛగా వ్యభిచారం సాగుతుంది. చాలా ప్రాంతాల్లో ఇంటి పనులు సాగుతున్నా, పోలీసులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఇంటి యజమానులూ జాగ్రత్త..

ఇంటి యజమానులు అద్దె దారులు ఏం చేస్తున్నారో ఓ కంటి కనిపెడుతూ జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. అద్దె ఇళ్లల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చడమే కాకుండా, ఇంటిని కిరాయికి ఇచ్చిన ఇంటి యజమానిపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. వరంగల్‌లో ఇళ్లను, షాపులను గుర్తు తెలియని వ్యక్తులకు కిరాయికి ఇస్తే ఇక నుంచి ఇంటి యజమానులు జాగ్రత్తలు పాటించాల్సిందేనని పేర్కొంటున్నారు. లేకుంటే చిక్కులు తప్పవంటున్నారు. అసరమైతే గృహాలను సీజ్ చేసే అధికారం పోలీసులకు ఉందంటున్నారు. కిరాయి ఎక్కువగా వస్తుందన్న ఆశతో గుర్తు తెలియని వ్యక్తులకు కిరాయికి ఇవ్వకూడదని సూచిస్తున్నారు. కిరాయిదారులకు సంబంధించిన ఓటరు కార్డు, ఆధార్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాని సూచిస్తున్నారు. పనిచేసే ఉద్యోగం, వ్యాపార వివరాలను పరిశీలించి ఇంటిని షాపులకు కిరాయి ఇవ్వాల్సి ఉంది. కిరాయి ఇళ్లల్లో వ్యభిచారం, పేకాటవంటి అసాంఘీక కార్యకలాపాలు నిర్వహిస్తే నిందితులతో పాటు ఇంటి యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

యజమానులు అప్రమత్తంగా ఉండాలి..

నందిరాం నాయక్, ఏసీపీ వరంగల్



ఇంటి యజమానులు ఇల్లు అద్దెకిచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. కిరాయిదారుడి సంబంధించిన పూర్తి వివరాలను, గుర్తింపు కార్డులను పరిశీలించాలి. అవసరమైతే ఇద్దరు ముగ్గురు రిఫరెన్స్‌ను తీసుకోవాలి. వారి గురించి తెలిసిన వారితో మాట్లాడాలి. వ్యాపారస్థులైతే వ్యాపారానికి సంబంధించిన వివరాలను పరిశీలించాలి. అద్దె ఇళ్లల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించండి

ఎన్నికల సిబ్బందికి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచన



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19: త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. మంగళవారం వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులతో మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే వారిని గుర్తించి విచారణ అనంతరం నోడల్ అధికారులు కేసులు నమోదు చేయాలన్నారు. వాహనదారుల వద్ద రూ.50 వేలకు మించి డబ్బులు ఉండే సీజ్ చేయాలని, పంచనామా అనంతరం పూర్తి సమాచారాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియచేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సిటీ ప్లానర్ వెంకన్న, కుడా సీపీవో అజీత్‌రెడ్డి, ఏఈలు ప్రవీణ్‌చంద్ర, కృష్ణారావు, 'కుడా'సెక్రెటరి మురళీధర్‌రావు, ఏసీపీ నందిరాంనాయక్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్ పాల్గొన్నారు.

డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయండి

గ్రేటర్ పరిధిలో నివసిస్తున్న వృద్ధులకు డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సిటిజన్ అసోసియేషన్, ఓరుగల్లు వినియోగదారుల రక్షణ సమితి ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటీజన్లు నర్సయ్య, యుగేంధర్, సత్యనారాయణ, సాంబయ్య, రవీందర్‌గౌడ్, జార్జీలు ఉన్నారు.

దివ్యాంగులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

గ్రేటర్ పరిధిలో నివసిస్తున్న దివ్యాంగులు ఓటు హక్కును విధిగా సద్వినియోగం చేసుకోవాలని లోక్‌సభ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. మంగళవారం ఐఎంఏ హాలులో దివ్యాంగులు, సీనియర్ సిటిజన్‌లకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికలలో దివ్యాంగులు సౌకర్యార్థం ర్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో 12 వేల మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, ప్రతీ ఒక్కరు ఓటు హక్కును బాధ్యతగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఫామ్-8 సమర్పణ ద్వారా పీడబ్ల్యూడీ మార్కింగ్ ఇవ్వాలన్నారు. దివ్యాంగులు 12 (డి) ఫామ్‌ను నింపి సమర్పిస్తే ఇంటి వద్ద నుంచి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. దివ్యాంగులైన ఓటర్లతో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, టీపీఆర్‌వో రాజేశ్‌కుమార్, తహసీల్దార్ ఇక్బాల్, టీఎం సి.రమేష్, దివ్యాంగ సంఘం నాయకులు బండి రాజేందర్, చక్రపాణి, వాణి, సీవోలు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి అంగడి వేలం

గీసుగొండ, మార్చి 19: కొమ్మాల అంగడి పరిధిలోని పలు గ్రామవాటాల వేలం పాటలను ఈనెల 20, 21, 22 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎంపీవో ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 20న దస్రూతండా, 21న నందనాయక్‌తండా, 22న కొమ్మాల జీపీ కార్యాలయాల్లో వేలం పాటలను చేపడుతామని చెప్పారు. వేలంలో పాల్గొనేవారు గతంలో ఆయా జీపీలకు బకాయిలు ఉండకూడదన్నారు. టెండర్‌దారులు రూ.2 లక్షల డీడీలు తీసి వేలంలో పాల్గొనాలని సూచించారు. ప్రతి శనివారం అంగడి ఉంటుందని, సంవత్సరంలో మొత్తం 52 అంగడిలు జరుగుతాయని వివరించారు. కాగా కొమ్మాల జీపీకి 20, విశ్వనాథపురం జీపీకి 13, నందనాయక్‌తండాకు 7, దస్రూతండాకు 6, సూర్యాతండాకు 6 అంగడిల నిర్వాహణ చేసుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు ఆయన చెప్పారు.

సైకిల్‌స్టాండ్ వేలం రూ.2.46లక్షలు

కొమ్మాలశ్రీలక్ష్మినరసింహస్వామి సైకిల్‌స్టాండ్ వేలం పాటను మంగళవారం నిర్వహించగా రూ.2.46 లక్షలు వచ్చినట్లు ఎంపీవో ప్రభాకర్ తెలిపారు. జాతరకు వచ్చే టూవీలర్‌లకు రూ.20, ఫోర్ వీలర్‌లకు రూ.50, ట్రాక్టర్ వంటిపెద్ద వాహనాలకు రూ.100 టోకెన్ ఉంటుందని వివరించారు. టెండర్‌దారులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు



ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సంగెం, మార్చి 19 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ప్రభుత్వ అధికారులు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్‌ఐ బాలాజీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బీసీల మహా పాదయాత్ర



అరుణను సన్మానిస్తున్న స్థానికులు

సంగెం మార్చి 19: చట్ట సభల్లో బీసీల వాటా కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగుతున్న మహాపాదయాత్రలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు అరుణ పాల్గొన్నారు. మామునూరుకు అరుణ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే గత కొద్ది రోజులుగా ఆల్ ఇండియా ఓబీసీ జాక్, హిందు మహాసభ, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సాగే పాద యాత్రలో అరుణ పాల్గొంటున్నారు. మంగళవారం జరిగిన యాత్రలో అరుణను తిరుమలగిరి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ఎన్నికల సమయంలో గొడవలు చేస్తే కఠినచర్యలు: ఏసీపీ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ నందిరాం నాయక్

వరంగల్ చౌరస్తా, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, అల్లర్లు, గొడవలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ హెచ్చరించారు. మంగళవారం ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు చేయవద్దని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఇంతేజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్, ఎస్సై, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

వరంగల్ సిటీ, మార్చి 19: రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్టిలో పెట్టుకుని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలను సారం మామునూర్ ఏసీపీ తిరుపతి, ఏనుమాముల ఎస్‌హెచ్‌వో పులి రమేష్ ఆధ్వర్యంలో సుందరయ్యనగర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కాలనీవాసులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. కాలనీలో కొత్త వ్యక్తులు టచ్చాడినా, అనుమానాస్పదంగా కనబడినా, మారణాయుధాలతో తిరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కాలనీలలో తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వాడేవారున్న పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రాజు, నర్సింహరావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

సాగు, సంరక్షణపై అవగాహన

వరంగల్ వ్యవసాయం, మార్చి 19: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్‌లో మంగళవారం రెండో రోజు మండల పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశం జరిగింది. రాజేంద్రనగర్ అగ్రి కల్చర్ యూనివర్సిటీ వాతావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త లీలారాణి మాట్లాడుతూ వానాకాలం, యాసంగిలో సాగు, సంరక్షణ వాతావరణ పరిస్థితులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులలో చేపట్టదగిన ఆపత్కాల పంటలపై అవగాహన కల్పించారు. అనంతరం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతులతో వివిధ సబ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సబ్ కమిటీలు పంటల వారిగా మధ్య తెలంగాణ మండలంలోని రైతుల సమస్యల గురించి చర్చించి పరిశోధన అలాగే విస్తరణ విభాగము చేపట్టదలిచిన కార్యక్రమాలను వివరించారు. కార్య క్రమంలో పరిశోధన సంచాలకులు పి.రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకులు డి.వి.సుధారాణి, మధ్య తెలంగాణ మండలం సహ పరిశోధన సంచాలకులు ఆర్.ఉమారెడ్డి పాల్గొన్నారు.

'ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వరంగల్ ఎస్‌ఆర్‌ఆర్ తోటలోని ప్రైవేటు పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ చక్రవర్తికి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిబంధనల మేరకు ఆటస్థలం, ఫైర్ సేఫ్టీ లేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐ ఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చుక్క ప్రశాంత్, యార ప్రశాంత, ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ తదితరులు ఉన్నారు. డీఈవో డి.వాసంతిని కలిసిన ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎస్బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీం నవీద్ ఉన్నారు.

అధ్వానంగా ఆరోగ్య కేంద్రాలు



పోచమ్మమైదాన్, మార్చి 19: జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై పర్యవేక్షణ కరువైంది. పట్టించుకునే వారు లేకపోవడంతో ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పేదలకు ఆరోగ్యకేంద్రాల్లో అరకొర సేవలు అందుతున్నాయి. జిల్లా పరిధిలో ఏడు పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు సీహెచ్‌సీ సెంటర్లు (సామాజిక ఆరోగ్య కేంద్రాలు), రెండు బస్తీ దవ ఖానాలు ఉన్నాయి. జిల్లా వైద్య, ఆరో గ్యశాఖ అధికారి నేతృత్వంలో జిల్లా పరిధిలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీ, బస్తీ దవఖానాలు కొనసాగాల్సి ఉంది. నిరుపేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ఆరోగ్య పథకాలు, వైద్య సేవలందించే ఆరోగ్య కేంద్రాలను నిత్యం పర్యవేక్షించాల్సిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోకపోవ డంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణలపై అవగాహన పెంపొందించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి అసలు ఆరోగ్యకేంద్రాల వైపు కనీసం కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వెలు వడుతున్నాయి.

సిబ్బంది ఇష్టారాజ్యం

జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది ఇష్టారాజ్యం కొనసాగుతుందని పలువురు వాపోతున్నారు. పట్టించుకునే వారు లేకపోవడంతో ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వర్తించే మెడికల్ ఆఫీసర్లు తమకు నచ్చిన వేళలో ఆర్యోగ కేంద్రాలకు వచ్చి వెళ్తున్నారని ఆరోపణలు వెలువడుతున్నాయి. కొంతమంది మెడికల్ ఆఫీసర్లు రెండు మూడు రోజులకు ఒకసారి సైతం వెళ్లడం లేదని, వెళ్లినప్పటికీ తూతూ మంత్రంగా విధులు నిర్వర్తించి ఇంటిముఖం పడుతున్నారు. అధికారులు డ్యూటీకి వెళ్లినా.. వెళ్లకపోయినా హాజరు పట్టికలో మాత్రం డ్యూ టీకి వచ్చినట్లు నమోదు చేస్తున్నారని తెలుస్తోంది. మెడికల్ ఆఫీసర్లే సరైన విధంగా విధులు నిర్వర్తించకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఆరోగ్య కేంద్రాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగాల్సిన సేవలు తూతూమంత్రంగా ముగిస్తూ, కేవలం టీకాలు ఇచ్చే కేంద్రాలుగా వ్యవహరిస్తూ మధ్యాహ్నం వరకే ఆరోగ్య కేంద్రాలకు తాళం వేస్తున్నారు.

అరకొరగా సేవలు...

జిల్లాలో నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాలలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయ పాలన పాటించకుండా ఆరోగ్య కేంద్రాల సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక పలుచోట్ల పూర్తి స్థాయిలో ఉచిత వైద్య శిబిరాలు సైతం నిర్వహించడం లేదు. దీంతో సరైన సేవలు అందక అనేక మంది నిరుపేదలు అవస్థలు పడుతున్నారు.


లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

రాయపర్తి, మార్చి 19 : మండలంలోని తిర్మలాయపెల్లిలో మంగళవారం కన్నుల పండుగగా శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణం నిర్వహించారు. వేదపండితులు పరశారం సుదర్శనచారి, భరతకిరాణాచార్యులు, వెంకటచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో దొంతరబోయిన సోమలక్ష్మి, మల్లికాంబ, సమ్మక్క, రజిత, వెంకన్న, నాగార్జున్, వెంకటేశ్వర్లు, బండి రాంమూర్తి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవాలి

పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి


దుర్గమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఝాన్సీరెడ్డి

రాయపర్తి, మార్చి 19 : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతీ ఒక్కరు కాపాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుబ్బెటి తండాలో దుర్గమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆమె పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ మన కట్టుబాట్లు, సాంప్రదాయాలు, పండుగలను భావితరాలకు అందించేలా చూడాలన్నారు. నియోజకవర్గంలోని గిరిజన తం డాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ పక్వాడ్ ఉత్సవాలు


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చెన్నారావుపేట, మార్చి 19: మండలంలోని ఉప్పరపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ పక్వాడ్ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషణ ఆహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ ద్వారా గర్భిణీలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆకు కూరలు, కూరగాయల ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు విజయలక్ష్మి, ఉడ్గుగుల రజిత, ఆయాలు నీలమ్మ, చల్ల పద్మ, అంజు, ప్రవళ్లిక, కావటి అరుణ, తదితరులు పాల్గొన్నారు.

సంత వేలం పాటలు వాయిదా

నెక్కొండ, మార్చి 19 : నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారంతపు సంత, రహదారి వసూళ్ల వేలం పాటలను మంగళవారం నిర్వహించిగా వేలం పాటలు వాయిదాపడ్డాయి. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నెక్కొండ ప్రత్యేకాధికారి తహసీల్దార్ రాజ్‌కుమార్ సమక్షంలో వేలం పాటలను నిర్వహించారు. మేకలు, గొర్రెలు, పశువుల, తై బజార్ రహదారి వేలం పాటలకు సంబంధించి నిర్ణీత ధర రాకపోవడంతో వేలం పాటలను వాయిదా వేశారు. ఈనెల 23న మళ్లీ వేలం పాటలను నిర్వహిస్తామని కార్యదర్శి డి. సదానందం తెలిపారు.

మునిసిపాలిటీలో ముసలం

•వర్ధన్నపేటలో పడకేసిన పారిశుధ్యం •తుప్పు పడుతున్న స్వచ్ఛ భారత్ రిక్షాలు • జీతాల్లేక అవస్థలు పడుతున్న సిబ్బంది



వర్ధన్నపేట నూతన మునిసిపాలిటీ భవనం

వర్ధన్నపేట రూరల్, మార్చి 19 : వర్ధన్నపేట మునిసిపాలిటీ పాలన మూలన పడింది. అటు అధికారులు, ఇటు కౌన్సిలర్లు మునిసిపాలిటీలోని సమస్యలపై శీతకన్ను ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వం మారిన నాటి నుంచి ప్రజాప్రతినిధులు ఆయా వార్డులను పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వార్డుల్లో పారిశుధ్యం సమస్య తాండవిస్తోంది. చెత్తను సైతం ప్రజలు ఎక్కడ పడితే అక్కడ వేస్తుండడంతో సిబ్బంది సైతం అన్ని చోట్ల పనిచేయలేకపోతున్నారు. చెత్తను తరలించే ఆటోలు సైతం రిపేరుకు రావడం, స్వచ్ఛ భారత్ ట్రై సైకిళ్లు మూలన పడేయడంతో తుప్పుపడుతున్నాయి.

అవిశ్వాసం వీగడంతో అసహనం...

కొందరు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు ప్రస్తుత చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. వివిధ నాటకీయ పరిణామాల నడుమ అవిశ్వాసం వీగిపోయింది. దీంతో పలువురు కౌన్సిలర్లు అసహనానికి గురయ్యారు. అప్పటి నుంచి మునిసిపాలిటీలో జరుగుతున్న కార్యక్రమాలకు, వివిధ ప్రారంభాలకు దూరంగా ఉంటున్నారు. చివరకు మునిసిపాలిటీ బడ్జెట్ సమావేశాలకు సైతం డుమ్మా కొట్టడంతో ఆ మధ్య కాలంలో సోషల్ మీడియాలో కౌన్సిలర్ల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపించాయి.

తుప్పు పడుతున్న ట్రై సైకిళ్లు...

స్వచ్ఛభారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం మునిసిపాలిటీకి చెత్తను సేకరించేందుకు అందించిన ట్రై సైకిళ్లు తుప్పు పడుతున్నాయి. ప్రస్తుత కార్యాలయంలో మూలన పడి దర్శనమిస్తున్నాయి. రూ. లక్షలు వెచ్చించిన ఆటోలు రిపేరుకు రావడంతో వాటిని బాగు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీలో నాలుగు ఆటోలు, రెండు ట్రాక్టర్లు ఉన్నాయి. ఇందులో రెండు ఆటోలు రిపేరుకు రావడంతో వాటిని రిపేరు చేసే పరిస్థితి లేక పక్కన పెట్టారు. దీంతో ఉన్నవాటితోనే చెత్తను సేకరిస్తున్నారు.


మూలన పడి తుప్పు పడుతున్న ట్రై సైకిళ్లు

నిరుపయోగంగా కొత్త భవనం

వర్ధన్నపేట మునిసిపాలిటీ కార్యాలయ నూతన భవనాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్మించారు. అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేశ్ దానిని ప్రారంభించినప్పటికీ కార్యకలపాలు మాత్రం ఇంకా పాత భవనంలోనే నడుస్తున్నాయి. దాదాపు ఐదు నెలల క్రితం భవనాన్ని ప్రారంభించినా ఇప్పటి వరకు విద్యుత్ సరఫరా ఇవ్వకపోవడంతో అందులోకి వెళ్లడం లేదు. రూ. కోట్లు వెచ్చించి భవనాన్ని నిర్మించిన ప్రభుత్వం, అధికారులు విద్యుత్ సరఫరాను అందించడంలో విఫలమవడం విడ్డూరంగా ఉందని పట్టణవాసులు చర్చించుకుంటున్నారు.

ముందుకు సాగని ఇంటిగ్రేటెడ్ మార్కెట్..

వర్ధన్నపేట నియోకవర్గ కేంద్రానికి తలమానికంగా ఉన్న ప్రభుత్వ గెస్ట్ హౌజ్(డాబ్ బంగ్లా)ను కూల్చివేసి, ఆ స్థలంలో అప్పటి ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించేందుకు సిద్ధమైంది. ఆ పనులు ప్రారంభించి దాదాపు నాలుగు సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇంకా పిల్లర్లకే పరిమితమయ్యాయి. మార్కెట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, దానిని అసంపూర్తిగా వదిలేయడంతో వ్యాపారస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పట్టణంలోని ఓ వార్డులో డ్రైయినేజీ దుస్థితి

జీతాల్లేక అవస్థలు పడుతున్న సిబ్బంది

రెండు నెలలుగా మునిసిపాలిటీలో పనిచేస్తున్న కిందిస్థాయి సిబ్బందికి జీతాలు అందడం లేదు. సఫాయిలు, పన్నులు వసూలు చేసే సిబ్బంది, నీటిని సప్లై చేసే వాటర్‌మెన్, చెత్త ఆటోలు, ట్రాక్టర్లను నడిపే డ్రైవర్లతో పాటు ఆఫీసులో కంప్యూటర్ వర్క్ చేసే వారికి కూడా జీతాలు సకాలంలో అందడం లేదు. దీంతో సమయానికి కట్టాల్సిన ఈఎంఐలు, వివిధ ఆర్థిక లావాదేవీలు నిలిచిపోవడంతో అప్పులు చేస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి జీతాలు సకాలంలో వచ్చేలా చూడాలని వేడుకుంటున్నారు. కౌన్సిలర్లకు సైతం దాదాపు రెండు సంవత్సరాలుగా జీతాలు అందడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

దేవాలయాలతో ప్రశాంత వాతావరణం

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండ, మార్చి 19: దేవాలయాలతో గ్రామాలు, పల్లెలోని ప్రజల్లో భక్తిభావాలు పెంపొంది ప్రశాంత వాతవారణం నెలకొంటుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని నెక్కొండతండాలో నూతనంగా నిర్మించిన దుర్గమ్మగుడిని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ ఈ గుడికి దుర్గమాత విగ్రహాన్ని ఇప్పించే అవకాశం కలగడం సంతోషించదగిన విషయమన్నారు. అలాగే పత్తిపాకలో జరిగిన దుర్గమాత ఉత్సవాలు, ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ తక్కలపల్లి రవీందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు భక్కి అశోక్, హరిప్రసాద్, డీసీసీ కార్యదర్శి రావుల హరీశ్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు బండి శివ, మండల యూత్ అధ్యక్షుడు రావుల మైపాల్‌రెడ్డి, నాయకులు కుసుమ చెన్నకేశవులు, బొమ్మరబోయినతదితరులు పాల్గొన్నారు.

మేరుసంఘం ఆధ్వర్యంలో సన్మానం

నర్సంపేట: రాష్ట్ర ప్రభుత్వం మేరుకులస్థుల సంక్షేమం కోసం మేరుకార్పోరేషన్‌ను ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ మంగళవారం ఎమ్మెల్యే దొంతిమాధవరెడ్డిని మేరుసంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేరుసంఘం పట్టణ అధ్యక్షుడు రామగిరి రవికుమార్, మండలకమిటీ అధ్యక్షుడు ఓడపల్లి గోవర్ధన్, జిల్లా కోశాధికారి రామగిరియాదగిరిస్వామి, పట్టణ ప్రధానకార్యదర్శి గట్ల రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామ సొసైటీ ఉపాధ్యక్షుడు గుడిపెల్లి ధర్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ రూపిక శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ బొమ్మినేని శ్రీనివాస్ రెడ్డిలతో పాటు పలువురు మంగళవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబు, క్లస్టర్ ఇన్‌చార్జి మట్టు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, భరత్‌రెడ్డి, మాదాసి సాంబయ్య, శ్రీరామోజు ప్రభాకర్, మట్టు రమేశ్, మురారి, నరేశ్, పాల్గొన్నారు.


నెక్కొండ తండాలో దేవాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

చర్చి ఉత్సవాల్లో పాల్గొన్న దొంతి

చెన్నారావుపేట: మండలంలోని జోజిపేట నారాయణతండాలోని పునితాజోజప్ప చర్చి ఉత్సవాలల్లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చర్చిలో కెక్ కట్ చేసి ఊరు పండుగ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ ఏసు ప్రభు ఆశీస్సులతో సంతోషంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


గోదాములను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణవేణి, ఉద్యోగులు

మార్కెట్ యార్డును సందర్శించిన ఆర్డీవో

నర్సంపేట, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో స్ట్రాంగ్‌రూముల కోసం పట్టణంలోని వ్యవసాయమార్కెట్ యార్డును మంగళవారం ఉద్యోగులతో కలిసి ఆర్డీవో కృష్ణవేణి సందర్శించారు. గత కొన్నేళ్లుగా అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో వినియోగించిన స్ట్రాంగ్ రూమ్ అనువుగా లేకపోవడంతో మార్కెట్ యార్డులోని, కవర్‌షెర్డు, పలు గోదాములను ఆమె పరిశీలించారు. మార్కెట్‌లోని ఒకటి, రెండు గోదాములు అనుకూలంగా ఉండడంతో అందులో ఉన్న మార్కెట్ యార్డుకు సంబంధించిన పరికరాలను ఇతర గోదాముల్లోకి తరలిస్తే స్ట్రాంగ్‌రూమ్‌కు అనుకూలంగా ఉంటుందని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ సాయికృష్ణ, సర్వేయర్ దశరథం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అమలు చేయాలి

వర్ధన్నపేట రూరల్, మార్చి 19 : ఎన్నికల ప్రవర్తన నియమ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ నోడల్ ఆఫీసర్, మామూనూరు ఏసీపీ తిరుపతి సూచించారు. మంగళవారం పట్టణ శివారులోని డీసీ తండా వద్ద ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టును ఆయన పరిశీలించి వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై వెళ్తున్న పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా పార్టీల నాయకులు, ప్రజలు ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సందర్భంగా అధికారులకు సహకరించాలని కోరారు. నిబంధనల ప్రకారం రూ. 50 వేల కంటే ఎక్కువ తీసుకుని ప్రయాణించకూడదని తెలిపారు. సరైన పత్రాలు ఉంటే డబ్బులు తరలించవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజ్ సాగర్, సీఐ సూర్య ప్రకాష్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


డీసీతండా వద్ద కారును తనిఖీ చేస్తున్న ఏసీపీ తిరుపతి

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

ప్రకృతి పర్యావరణ సంస్థ సీఈవో జయశ్రీ

దుగ్గొండి, మార్చి19: మత్స్యకారుల అభివృద్ధికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయడం జరుగుతుందని ప్రకృతి పర్యావరణ సంస్థ సీఈవో మూగ జయశ్రీ అన్నారు. మండలంలోని గిర్నిబావిలో జల్లా ప్రాథమిక మత్స్యసహకార సంఘం కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మత్స్యశాఖ సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వ రాయితీలు, చేపల కేంద్రాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మత్స్యశాఖ సంఘాలు లబ్ధి పొంది కుటుంబాలు బలోపేతం కావాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రాజెక్టు ఇన్‌చార్జి వినోద్‌కుమార్, పది గ్రామాల మత్స్యశాఖ డైరెక్టర్లు పాల్గొన్నారు.


గిర్నిబావిలో మాట్లాడుతున్న జయశ్రీ

‘ఎమ్మెల్యే నిర్ణయాన్ని వ్యతిరేకించడం హేయమైన చర్య’


వర్ధన్నపేటలో మాట్లాడుతున్న మైస సురేష్ కుమార్

వర్ధన్నపేట రూరల్, మార్చి 19 : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తీసుకున్న నిర్ణయాన్ని సొంత పార్టీ నాయకులే వ్యతిరేకించడం హేయమైన చర్య అని పట్టణ కాంగ్రెస్‌పార్టీ నూతన అధ్యక్షుడు మైస సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యే నాగరాజుపై కొందరు కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెప్పుడు మాటలు విని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సీనియర్ నాయకులు కొందరు గతంలో ఇక్కడ కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వారికి వెన్నుపోటు పొడిచి, ఇతర పార్టీలకు సహకరించిన విషయం అందరికీ తెలుసన్నారు. పట్టణ అభివృద్ధి కోసం పాటుపడుతూ కలిసికట్టుగా పార్టీని బలోపేతం చేసుకుందామని, ఎమ్మెల్యేపై బాహాటంగా మీడియా సమావేశాలు పెట్టి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మంచాల రామకృష్ణ, తుమ్మల రవీందర్, దేవస్థాన డైరెక్టర్ కీమానాయక్, మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, నాయకులు ఆరెల్లి ప్రభాకర్, సిలివేరు శ్రీధర్, రామగిరి వంశీ, పెద్దబోయిన దేవేంద్ర, పిన్నింటి వెంకటేశ్వర్‌రావు, గుజ్జ వీరన్న, బాబులాల్, శేఖర్, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

24న డివిజన్ స్థాయి అబాకస్ పోటీలు

నర్సంపేట టౌన్, మార్చి 19 : లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న నర్సంపేట పట్టణంలో డివిజన్ స్థాయి అబాకస్, చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కాసుల రవికుమార్ తెలిపారు. మంగళవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూకేజీ నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లో నిర్వహించే పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9398148123, 9676867252 నెంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

నెక్కొండ, మార్చి 19 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పద్మశాలీల ఆర్థికాభివృద్ధికి గాను కార్పోరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం నెక్కొండలోని అంబేద్కర్ సెంటర్లో సీఎం రేవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్ర పటాలకు మంగళవారం పద్మశాలీలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు రాపాక కట్టయ్య, కుసుమ చేన్నకేశవులు, రాపాక వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, కుడికాల సుధాకర్, సందీప్, రఘువీర్, ఉపేందర్, శ్రీహరి, డిసెంట్ వెంకటేశ్వర్లు, మార్కెండయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ చెక్‌పోస్ట్‌ను సందర్శించిన సీపీ


చెక్‌పోస్టు వద్ద అధికారులకు సూచనలిస్తున్న సీపీ

నర్సంపేట టౌన్, మార్చి 19 : ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నర్సంపేట పట్టణ శివారు మహేశ్వరంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును వరంగల్ సీపీ అంబర్‌కిషోర్‌ఝా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ ఏర్పాట్లతో పాటు, చేపట్టాల్సిన తనిఖీలపై అధికారులకు సీపీ సూచనలు చేశారు. తనిఖీల సమయంలో ప్రతీ వాహనాన్ని, అనుమానితులను నిశితంగా పరిశీలించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

రాయపర్తి, మార్చి 19 : గుర్తు తెలియని లారీ ఢీకొని వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని మైలారంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మైలారం గ్రామంలో నిర్వహిస్తున్న బోనాల పండుగకు తన బంధువైన శివరాత్రి సుధాకర్ ఇంటికి ములుగు జిల్లా జాకారం ప్రాంతానికి చెందిన వల్లెపు ఉప్పలయ్య(70) వచ్చాడు. సోమవారం రాత్రి గ్రామంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. దీంతో ఉప్పలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కూతురు వెంకటమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూస్ విక్రయదారుడి అరెస్టు



జూస్ విక్రయదారుడి అరెస్టు చూపుతున్న ఎస్సై మహేందర్

నెక్కొండ, మార్చి 19 : నెక్కొండలోని అంబేడ్కర్ సెంటర్‌లో జూస్ విక్రయిస్తున్న రాజస్థాన్‌కు చెందిన కాలూరామ్‌పూర్బియా ప్రజలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ కల్తీ జూస్‌విక్రయాలకు పాల్పడుతుండటంతో అతడిని అరెస్టు చేసినట్లు ఎస్సై మహేందర్ మంగళవారం తెలిపారు. జూస్‌లో కల్తీలకు సంబంధించి సోషల్‌మీడియాల్లో వీడియోలు వైరల్ కావడంతో అతడితో పాటు జూస్ బండిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వరంగల్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి పోలీసు స్టేషన్‌లో ఉన్న జూస్‌ల నుంచి శాంపిళ్లను సేకరించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

చెన్నారావుపేట, మార్చి 19: మండలంలోని పాపయ్యపేట గ్రామ శివారు ధర్మతండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఎఫ్‌సీ నిధులు రూ .5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, మంద యాకయ్య, సిద్దెన రమేష్, తప్పెట రమేష్, బోడ రవి, భూక్యా భాస్కర్, అమీరుద్దీన్, బండి హరీష్, బాలునాయక్, హంస వినోద్, బాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన స్నేహితురాలికి సన్మానం

పర్వతగిరి, మార్చి 19: మండల కేంద్రానికి చెందిన పూజారి సువర్ణ ప్రభుత్వ ఉద్యోగం సాధించినందుకు గాను తోటి పదో తరగతి(1995-96) బ్యాచ్ స్నేహితులు సోమవారం బోకేను అందించి, శాలువతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడంలో సువర్ణను ప్రోత్సహించిన ఆమె భర్త సురేష్‌ను, తల్లిదండ్రులను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు భాగ్యలక్ష్మి, స్వప్న, నవీన్, నరేష్, రఘు, సుమన్, దేవలనాయక్, రవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.